

# నీవు వచ్చేవనీ...నీ పిలుపేవిని

## – విజయరాణి కోడూరి

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### సాధారణ బహుమతి పొందిన నవల

**(గత సంచిక తరువాయి)**

**ఆరోజు** ఇంకా బాగా గుర్తుంది హేమంత్‌కు.

"హ్యాపీ బర్త్‌డే లతా!" అన్నాడు.

ఆశ్చర్యంగా చూసింది లత అతడివైపు" ఎపుడో మీరడిగిత్ చెప్పాను బర్త్ డేట్ గురించి. అదిగుర్తు పెట్టుకున్నారా? థాంక్యూ హేమంత్" అంది.

"నా బర్త్‌డే ఎలా మరచిపోతాను?" అన్న హేమంత్ ముఖంలోకి చూసింది లత.

"అర్థం కాలేదు హేమంత్"

"ఈ రోజు మరొక అబ్బాయి బర్త్‌డే కూడానట."

"ఎవరిది?" ఆశ్చర్యంగా అడిగింది.

"డియర్ లతా, నీ హేమంత్ బర్త్‌డే కూడా ఈ రోజు."

"నిజంగా?"

"నిజంగానే. నువ్వు నీ బర్త్‌డేట్ చెప్పినప్పుడు, నాకూ ఆశ్చర్యం అనిపించింది సుమా!"

"హ్యాపీ బర్త్‌డే అండ్ మెనీ హ్యాపీ రిటర్న్స్" అంటూ అతడి చెయ్యి అందుకుంది.

"థ్యాంక్యూ చిన్న సెలబ్రేషన్ చేసుకుందామా?"

"అంటే ఎలా, ఎక్కడ?"

"నువ్వు ముందు బైక్ ఎక్కు చెప్తా" అన్నాడు ముందుకు జరుగుతూ.

ఒక్క క్షణం అతడి ముఖంలోకి చూసి బైక్ ఎక్కింది లత.

బైక్ ఆపి "దిగండి మేడం" అన్నాడు.

నెమ్మదిగా దిగి అతడిని అనుసరించింది లత.

జ్యూయెలరీ షాప్‌ను చూస్తూనే "గోల్డ్ బహుమతి నేను తీసుకోను హేమంత్, ప్లీజ్" అంది లత.

"గోల్డ్‌తో ఎపుడు పోట్లాడేవ్? పడదా ఇద్దరికీ?"

నవ్వేసింది లత. అతడి పక్కన నిలబడింది షాప్‌లో.

హేమంత్ జేబులోనుంచి ఒక రిసీట్ తీసిచ్చాడు షాప్ ఓనర్‌కు. అతడు అల్మారా తెరచి ఒక అందమైన బాక్సు తెచ్చి ఇచ్చాడు హేమంత్‌కు.

అతడికి ఎమౌంట్ ఇచ్చేసి బయటకు వచ్చి నిలబడ్డాడు హేమంత్.

"ఇప్పుడు చెప్పు లతా, ఎక్కడికి వెళ్దాం?" తన ముఖంలోకే చూస్తున్న లతను అడిగడూ అతడు.

"ఓహ్! ఛాయిస్ నాదనమాట" అంది.

"నేను చెప్పిన చోటుకు వచ్చారుగా అమ్మాయిగారు, అదే షాప్‌కు. ఇపుడు నువ్వు చెప్పిన చోటుకు 'జీహుజూర్ ' అంటూ ఈ అబ్బాయిగారు తీసుకెళ్తారు ఈ చందమామను" అంటూ బైక్ సీటు మీద ఉన్న ఆమె చేతిపై చెయ్యివేశాడు హేమంత్.

ఆ స్పర్శకు ఆమెలోని ఉలికిపాటును గమనించిన హేమంత్, చేతిని వెనక్కు తీసుకుంటూ "ఓకె.. ఓకె సారీ" అన్నాడు చిరునవ్వుతో.

"మరి 'చందమామ' అన్నావ్ కదా.. మరి నీ చందమామకు వెన్నెలలో తాజ్‌ను చూపిస్తావా హేమంత్?" అంది.

"అమ్మా లతా, నీది చిన్న కోరికే. కాని ఇప్పటికిప్పుడూ అంటే వైజాగ్‌లో ఉన్న ఈ మానవుడు ఎలా తీర్చగలడు? దానికో ప్లాన్, ఫ్లైట్‌కో టికెట్ రిజర్వేషన్‌లాంటివి అవసరంరా. కాని అతి త్వరలో వెళ్దాం, ప్రామిస్. దెబ్బతో తాజ్ బిత్తరపోవాలి ఆకాశం వైపు, నీవైపు చూసి, 'ఇదేంటి ఈరోజు రెండు చందమామలు వచ్చాయి' అని.

"ఓకె! ప్రామిసెస్ ఆర్ టు బికెప్ట్, డియర్ హేమ్" అంది చిరునవ్వుతో చేతిని ముందుకు చాపి.

"ప్రామిస్" అన్నాడు. చేతిని లత చేతిలో వేసి మృదువుగా నొక్కి వదిలాడు హేమంత్.

"అయితే ఇపుడు టెంపుల్‌కు వెళ్దామా?" అంది.

"మరీ ఇంత చిన్న కోరికా? పద పద వెళ్దాం" అంటూ బైక్‌ను స్టార్ట్ చేశాడతడు.

టెంపుల్ దగ్గర, ఆర్‌కె బీచ్‌లోను కూడా పెద్దగా రష్ లేదు. ఇద్దరి పేర్లు చెప్పి పూజ చేయించింది లత. చుట్టూ చూస్తూ "లతా ఇలా ఎక్కడైనా కూర్చుందామా ఒక్క క్షణం?" అన్నాడు హేమంత్.

"గుడికి వెళ్ళినపుడు అలా కూర్చుని వెళ్ళాలంటారు. రండి ఇక్కడ కూర్చుందాం" అంటూ పారిజాతం చెట్టు దగ్గర అరుగు మీద కూర్చుంది లత."

చెట్టు చుట్టూ, ఆరుగుపైన అందంగా ఎర్రని కాడలతో రాలి వున్నాయి పారిజాతాలు. నాలుగు పూలను తీసుకుంది.

"స్మెల్ చాలా బాగుంది కదా" అంది పూలను అతడికి దగ్గరగా పెట్టి.

"ఓహ్!" అన్నాడు నిట్టూరుస్తూ.

"ఏమైంది?"

"నీలాగే మత్తెక్కిస్తున్నాయి. తట్టుకోవటం కష్టంగా వుంది."

"తమరికి కవిత్వం కూడా బాగా వచ్చు. ఇంత చిలిపి తనం ఎక్కడ వచ్చింది?"

"సావాస మహిమ" అన్నాడు, ఆమె చేతిలోనుంచి ఒక పారిజాతాన్ని తీసుకుని పెదవులకు ఆనించుకుంటూ. గంట మోగుతుంటే అటు చూసింది, అతడి చూపులను ఎదుకోలేక.

"ఎంతకాలమో ఈ కష్టాలు" అంటూ పాకెట్‌లో నుంచి చిన్న ప్లాస్టిక్ బాక్స్ తీశాడు హేమంత్.

"ఐ లవ్‌యు" అంటూ ఆమెకు ఇచ్చాడు.

"ఇందులో ఏముంది?"

"ఓపెన్ చెయ్యండి మేడం" అన్నాడు.

తెరిచి చైన్ బయటకు తీసింది.

"వావ్ హేమ్ బ్యూటిఫుల్. 'హెచ్ ఎ ఎల్ ' అంటే హేమ్ – లత' కదూ!"

"ఏదో పెద్ద క్విజ్ సాల్వ్ చేసినట్టు పోజ్. మనిద్దరి పేర్లు అవేగా మరి. అన్నీ చెప్పాలి" అంటూ లతకు దగ్గరగా జరిగాడు. కొంచెం వెనక్కు జరిగింది లత సంశయంగా చూస్తూ.

ఆమె చేతిలో చెయిన్‌ను తీసుకున్నాడు మౌనంగా.

"నాకు ఏ దురుద్దేశంలేదు. ఈ హుక్కు వేసిద్దాం అని" అంటూ అందించబోయాడతడు.

అతడి కళ్ళలోకి చూస్తూ "మీరే వెయ్యండి హేమ్" అంది తలవంచి.

"ఇది ఎప్పుడూ నీ మెళ్ళోనే వుండాలి లతా" అన్నాడు. గొలుసును పైకి ఎత్తాడు హేమంత్ ఆమె మెళ్ళో వెయ్యటానికి.

అదేపనిగా మోగుతున్న సెల్ రింగ్‌కు ఉలికిపడి స్పృహలోకి వచ్చాడు అతడు. చేతిలో వున్న గొలుసును అయోమయంగా చూశాడు. అప్రయత్నంగా అతడి కళ్ళు చెమ్మగిల్లాయి.

"ఈ చైన్‌ను నేను నీ మెళ్ళో వెయ్యాలి లతా" అంటూ అన్నింటిని మళ్ళీ కవర్‌లో వేసి అల్మారాలో పెట్టేశాడు. మంచం మీద ఉన్న టవెల్‌తో కళ్ళు, ముఖం తుడుచుకుంటూ మళ్ళీ మోగుతున్న సెల్‌ను ఆన్ చేసి "హలో" అన్నాడు.

"ఫోన్ తియ్యవేంటిరా? కిందకురా" అవతలివైపున అరుణ్.

"అవును. లతకు ఎలావుందిరా?" అపుడు పూర్తిగా స్పృహలోకి వచ్చి అడిగాడు కంగారుగా.

"ఆపరేషన్ సక్సెస్‌రా, విన్సెంట్ సర్ వెళ్తున్నారు. త్వరగా రా మరి" అంటూ కట్ చేశాడు.

తొందర తొందరగా లిఫ్ట్ దగ్గరకు పరుగు తీశాడు హేమంత్.

లిఫ్ట్‌లోనుంచి పరుగున వస్తున్న హేమంత్‌ను డాక్టర్ విన్సెంట్ "కూల్ డౌన్ హేమంత్" అంటూ చెయ్యి పట్టుకుని ఆపాడు.

"లతకు ఎలా వుంది సర్?" ఆదుర్దాగా ఉంది హేమంత్ స్వరం.

"ఆపరేషన్ సక్సెస్ అయింది. ఆమె జనరల్ కండిషన్‌లో చాలా ఇంప్రూవ్‌మెంట్ కనిపిస్తుంది. నో వర్రీ హేమంత్. కరెక్ట్‌గా టైముకు తీసుకువచ్చావు. ఫార్టీ ఎయిట్ అవర్స్ థరో అబ్జర్వేషన్‌తో జాగ్రత్తగా చూసుకోవాలి."

"థాంక్యూ ప్రొఫెసర్. మీరు నాకు నిజమే చెప్తున్నారు కదూ?" సంశయంగా చూస్తున్న హేమంత్ భుజాల చుట్టూ చేతులు వేసి దగ్గరకు తీసుకున్నాడు డాక్టర్ విన్సెంట్, "గాడ్ ఈజ్ గ్రేట్ హేమంత్. లతకి ఏం కాదు. లేకుంటే ఇంత అనూహ్యంగా, ఇన్ని సంవత్సరాల తర్వాత మీరిద్దరూ కలవటం అన్నది ఒక మిరాకిల్" అంటూ.

అతడి చేతులలో ముఖం దాచుకున్నాడు హేమంత్. డాక్టర్ విన్సెంట్, హేమంత్‌ను ఒక కుర్చీలో కూర్చోపెట్టాడు.

"నోనో, బి బ్రేవ్ హేమంత్. డోంట్ ఫర్ గెట్ దట్ యు ఆర్ ఎ రెస్పాన్సిబుల్ డాక్టర్ టూ" అంటూ.

"అరుణ్... షి విల్ బి ఆల్‌రైట్. కాని అవసరం అనిపించిన క్షణం నాకు కాల్ చెయ్యి" కారు ఎక్కుతూ చెప్పాడు విన్సెంట్.

హేమంత్, అరుణ్‌లు అతడిని కారు వరకు వెళ్ళి పంపించి వచ్చారు.

"అరుణ్ ఒక్కసారి లతను చూడాలి" అంటున్న హేమంత్ భుజం చుట్టూ చెయ్యివేసి "రా వెళ్దాం" అన్నాడు అరుణ్. పోస్ట్ ఆపరేటివ్ కేర్ యూనిట్‌లోకి వెళ్ళారు ఇద్దరూ.

"చూడు హేమంత్, నువ్వు నెర్వస్ అవ్వటం నాకు నచ్చలేదు. లత నిన్ను చేరాలి, బ్రతకాలి నీకోసం అని రాసిపెట్టి వుందిరా. అందువల్లే ఇద్దరూ ఇలా అనూహ్యంగా కలిశారు. కమాన్" అంటూ లత బెడ్ దగ్గరకు తీసుకు వెళ్ళాడు.

లతను చూసిన హేమంత్ చలించిపోయాడు.

"లతకు ఏమైందిరా అరుణ్? ఇలా అయిపోయింది అంటే చాలా బాధగా వుందిరా. ఎక్కడున్నా తను సుఖంగా వుండాలి అని కోరుకుంటూ బ్రతికేస్తున్నాను. కాని ఇలా..." హేమంత్‌కు దుఃఖం ఆగలేదు.

అరుణ్ కళ్ళూ చెమ్మగిల్లాయి. హేమంత్‌ను గుండెకు హత్తుకున్నాడు అతడు.

"మనిద్దరం కలిసి లతను ఎప్పటిలా చేయగలం. తనను కాపాడుకోలేని మన చదువులు ఎందుకురా హేమంత్? నేను ప్రామిస్ చేస్తున్నాను. నీ లతను క్షేమంగా నీ చేతిలో పెడతాను. నువ్వు నిశ్చింతగా వుండు. ప్లీజ్" అరుణ్ స్వరం కంపించింది.

లత, హేమంత్‌ల బంధం తెలిసిన అరుణ్ మనసుకూడా ఉద్వేగానికి లోనైంది.

హేమంత్ నెమ్మదిగా లత బెడ్‌కు దగ్గరగా వెళ్ళాడు.

"లతా, యూ విల్ బి ఆల్‌రైట్. ప్లీజ్ నాకోసం వెనక్కు రా. నన్ను వదిలి ఎలా వెళ్ళిపోతావ్. నన్నుకూడా తీసుకెళ్ళు నీతో" అక్కడ్నుంచి వేగంగా వెను తిరిగి వెళ్ళిపోయాడతడు.

అతడిని అనుసరించి వెళ్తూ డ్యూటీ డాక్టర్ మదన్‌కు చెప్పాడు డాక్టర్ అరుణ్.

"చాలా జాగ్రత్తగా అబ్జర్వ్ చెయ్యండి. ఏ మాత్రం తేడా అనిపించినా నాకు రింగ్ చెయ్యండి. నేనుపైనే వుంఘాను డాక్టర్ హేమంత్ రూములో."

డ్రెస్ ఛేంజ్ చేసుకుంటున్న హేమంత్‌తో చెప్పాడు అరుణ్ "నేను ఇక్కడే వుంటున్నాను ఈ రెండురోజులు. ఉండాలి కూడా. సుమకు కాల్ చేసి చెప్పాను."

పడుకుంటున్న హేమంత్‌ను బలవంతగా లేపి బ్రెడ్ తినిపించి కాఫీ తాగించాడు అరుణ్.

"హేమంత్, నువ్వు రెస్ట్ తీసుకో. నిశ్చింతగా నిద్రపో. ఇదిగో ఈ టాబ్లెట్ వేసుకో" అంటూ మింగించాడు.

పేలవంగా నవ్వాడుహేమంత్.

"గుండె రగిలిపోతుంటే, దానిని ఒక టాబ్లెట్ తో నిద్రపుచ్చుదాం అంటే మనమాట వినదు కదురా" అంటూ.

"ఇదిగో ఇదే నచ్చదు నాకు. ఎక్కడుందో, అసలు ఉందో లేదో తెలియక సతమతమవుతున్న మననే చేరుకుంది కదరా లత. ప్లీజ్ రా హేమంత్ నువ్వు నిద్రపో, నన్నూ కాసేపు నిద్రపోనియ్" అన్నాడు రగ్గు కప్పుతూ.

ఈజీ ఛెయిర్‌ను అతడి బెడ్‌కు దగ్గరగా లాక్కుని నడుము వాల్చాడు అరుణ్.

సైలంట్‌లో ఉంచిన సెల్ వైబ్రేట్ అవ్వటంతో ఉలిక్కిపడి లేచాడు అరుణ్. ఈజీ ఛెయిర్‌ను పక్కకు నెట్టి, హేమంత్‌కు నిద్రాభంగం కాకుండా తలుపు దగ్గరకు వేసి లిఫ్ట్ వైపు వేగంగా నడిచాడు అతడు.

"హలో!" అన్న అరుణ్, డ్యూటీ డాక్టర్ మదన్ చెప్పినది వింటూనే లిఫ్ట్ దిగి పోస్ట్ ఆపరేటివ్ కేర్ యూనిట్‌లోకి పరుగుతీశాడు.

లత బెడ్ దగ్గర డాక్టర్లు, నర్సులు గుమికూడి ఉన్నారు.

అరుణ్‌కు మానిటర్‌లో డిస్‌ప్లే అవుతున్న అంకెలను చూడగానే విషయం అర్ధమైంది.

"జస్ట్ ఇపుడే చూసాం సర్. పల్స్ రేట్ తగ్గిపోతోంది" డాకర్ మదన్ చెప్పాడు.

అరుణ్ చెప్పిన ఇంజెక్షన్‌ను తొందరగా లోడ్ చేసి అందించింది సిస్టర్. దానిని సెలైన్ బాటిల్‌లోకి ఇంజెక్ట్ చేశాడతడు. ఆక్సిజన్ లెవెల్ గమనించిన అతడికి గాభరాగా వుంది.

వెంటనే డాక్టర్ విన్సెంట్‌కు రింగ్ చేశాడు.

పది నిమిషాలలో వచ్చాడు అతడు.

ఇంజెక్షన్ పేరు చెప్పి "క్విక్ సిస్టర్" అని అరిచాడతడు. పరుగున వచ్చి నర్స్ అందించిన ఇంజెక్షన్‌ను, లతకు సెలైన్ ఉన్న చేతిని వదిలి రెండో చేతికి ఐవి చేశాడతడు. మానిటర్‌పై మారిపోతున్న అంకెలవైపు ఆత్రంగా చూస్తూ నిలబడ్డాడు డాక్టర్ విన్సెంట్.

అరుణ్‌కు నోరు తడి ఆరిపోయింది.

"దేవుడా లతను కాపాడు ప్లీజ్. హేమంత్‌కు అతడు కోల్పోయిన జీవితాన్ని అందించినట్లే అందించి తిరిగి వెనక్కి తీసుకోకు" మన్సులో దేవుడిని ప్రార్థిస్తూ కుర్చీలో కూలబడ్డాడు అరుణ్.

అతడు బొటనవేలు చూపి 'వాటర్' అన్నట్టు సైగ చేశాడు సిస్టర్‌కు.

ఆమె వాటర్ బాటిల్ అందించింది. తొందరగా నీళ్ళు తాగి, మళ్ళీ బెడ్ దగ్గరకు వెళ్ళాడు. అరుణ్ గుండె స్పందన పెరిగింది.

విన్సెంట్, "అరుణ్" అన్నాడు.

"దేవుడు మన చేతిలో ఉంచినంతవరకు చేశాం. గాడ్ ఈజ్ గ్రేట్! హి ఓన్లీ కెన్ సేవ్ హర్ నౌ. హేమంత్ నిద్రపోయాడా?"

"అతడికి సెడెటివ్ ఇచ్చాను సర్" అన్నాడు. దుఃఖం పొగి వచ్చింది అరుణ్‌కి. వేగంగా డోర్ తీసుకుని బయటకు వెళ్ళిపోయాడతడు.

రెండు చేతులలో ముఖం దాచుకుని దుఃఖిస్తున్న అరుణ్‌ను సమీపించాడు డాక్టర్ విన్సెంట్.

'జరిగిన ఘోరాలకు తెరపడనీయకుండా గుండెలోనే రగులుతున్న అగ్నిపర్వతాన్ని భరిస్తూ ఎందరి జీవితాలలోనో వెలుగును నింపుతున్నాడు హేమంత్. లత 'ఇకలేదు' అని తెలిసిన మరుక్షణం, ఆ అగ్ని పర్వతం ప్రజ్వరిల్లి అతడి గుండె పగిలిపోతుంది' తలుచుకు తలుచుకు దుఃఖిస్తున్న అరుణ్ పక్కన కూర్చున్నాడు డాక్టర్ విన్సెంట్.

'నీ లతను క్షేమంగా నీ చేతిలో పెడతాను చెప్పాను. వాడికి నా ముఖం చూపలేను.'

"డాక్టర్" అంటూ విన్సెంట్‌ను చుట్టేశాడు అరుణ్. మౌనంగా అతడి వీపుపై తడుతూ ఉండిపోయాడు అతడు.

"లతకి ఏమైనా అయితే హేమంత్‌ను కూడా తనతో తీసుకుపోతుంది" చిన్నపిల్లవాడిలా దుఃఖిస్తున్న అరుణ్‌ను బలవంతంగా లేపి కూర్చోపెట్టాడు డాక్టర్ విన్సెంట్.

"కాన్షస్‌లోకిరా అరుణ్. బీయింగ్ డాక్టర్స్, మనకు గుండె దిటవు, ధైర్యం ఉంటేనే పేషెంట్ల ప్రాణాలు కాపాడగలుగుతాం. డాక్టర్ కూడా ఒక వ్యక్తే కావచ్చు. కాని అతడు తననే నమ్ముకుని ఉన్న పేషెంట్లను, తన మీద నమ్మకంతో వారిని తన చేతిలో పెట్టిన వారి ఆప్తులను మరచి ఎమోషన్స్‌కు గురైతే వారికి న్యాయం జరగదు. చెయ్యలేము కూడా."

డాక్టర్ విన్సెంట్ మాటలతో అరుణ్ లేచి సరిగ్గా కూర్చున్నాడు. షర్ట్ స్లీవ్‌తో కళ్ళు ఒత్తుకున్నాడు అరుణ్ "సారీ సర్" అంటూ.

అంతలో ఓపెన్ అయిన లిఫ్ట్‌లోంచి బయటకు వచ్చి సమీపిస్తున్న హేమంత్‌ను చూసిన డాక్టర్లిద్దరూ టెన్షన్‌కు లోనయ్యారు.

"గుడ్‌మార్నింగ్ హేమంత్" వీలైనంత ప్రసన్నంగా చెప్పాడు డాక్టర్ విన్సెంట్.

"వెరీ గుడ్ మార్నింగ్ సర్. అవునూ, మీరు ఇంత ఎర్లీగా ఈ టైములో వచ్చారేంటి? లత ఎలావుంది? ఎనీ ప్రాబ్లం?" అంటూ గాబరాగా లోపలకు వెళ్ళబోయిన హేమంత్‌కు డాక్టర్ మదన్ ఎదురు వచ్చాడు. పరుగులాంటి నడకతో డాక్టర్ విన్సెంటా దగ్గరకు వెళ్ళాడు "సర్, పేషెంట్ లత పల్స్ రేట్ ఇంక్రీజ్ అవుతోంది" అంటూ.

ఒకసారి వాళ్ళ ముఖాలలోకి చూసి, వేగంగా లోపలకు వెళ్ళాడు హేఅంత్.

విన్సెంట్, అరుణ్‌లు ముఖాలు చూసుకుని, అతడిని అనుసరించి వెళ్ళారు.

డిస్‌ప్లే అవుతున్న నంబర్లు చూసి డాక్టర్ విన్సెంట్ తేలికగా ఊపిరి తీసుకున్నాడు. లత నుదుటిపై చెయ్యివేసి చూసి థ్యాంక్ గాడ్ ఇద్దరు డాక్టర్లకు ప్రాణం పోశావ్" అనుకున్నాడు మనసులో.

అరుణ్ ఆనందానికి అవధులు లేవు.

"హేమంత్, షి ఈజ్ అవుట్ ఆఫ్ డేంజర్" అన్నాడు విన్సెంట్. మౌనంగా బయటకు వెళ్ళిపోతున్న హేమంత్‌ను అనుసరించి వెళ్ళారు ఇద్దరూ.

సోఫాలో కళ్ళు మూసుకుని వెనక్కి చేర్లబడి కూర్చున్న హేమంత్ పక్కన కూర్చున్నాడు అరుణ్.

"సిస్టర్ క్యాంటిన్‌కు రింగ్ చేసి అందరికీ కాఫీ చెప్పు" అంటూ వేరే సోఫాలో కూర్చున్నాడు విన్సెంట్.

హేమంత్ పరిస్థితి అర్థం అయింది ఆయనకు. 'ప్రేమించిన లత దూరం అయిపోయింది. కన్న తల్లితండ్రులు కళ్ళ ఎదురుగా కనుమరుగైపోయారు. అంత బాధనూ 'మానవసేవ' అన్న మందుతో చల్లబరుస్తూ, ఇప్పటికి ఒక రొటీన్‌లో పడి బ్రతుకుతున్నాడు పాపం. థ్యాంక్ గాడ్ యు ఆర్ గ్రేట్!' పదేపదే అనుకున్నాడు అతడు.

"హేమంత్" అంటూ మాట్లాడబోయిన అరుణ్‌కు చెయ్యి అడ్డంగా పెట్టి మాట్లాడవద్దన్నట్టు వారించాడు హేమంత్.

కాఫీ తీసుకు వచ్చాడు బోయ్. అరుణ్ ఒక కప్పు తీసుకెళ్ళి డాక్టర్ విన్సెంట్‌కు ఇచ్చాడు.

"థాంక్యూ" అంటూ తీసుకుని మీరూ తాగండి అన్నాడతడు.

"హేమంత్, మై చైల్డ్" అంటూ వచ్చి హేమంత్ పక్కన కూర్చున్నాడు విన్సెంట్.

"థాంక్యూ సర్ లతను కాపాడారు" అంటూ అతడి పాదాలను తాకి నమస్కరించాడు హేమంత్.

"థ్యాంక్స్ చెప్పవలసింది నాకు కాదు హేమంత్, థాంక్ హిమ్" అంటూ పైకి చూపాడతడు.

"హేమంత్ బైదిబై ఒకమాట లత కేర్ పూర్తిగా ఇక నీదే. నువ్వు ఆహారంవిషయంలో అశ్రద్ధగా ఉంటే కష్టం సుమా! టేక్ కేర్ ఎబౌట్ యువర్ హెల్త్ ఫస్ట్" అంటూ లేశాయన.

"అరుణ్ ఇక నే వెళ్తాను. టేక్ కేర్" అంటూ ఇద్దరివైపు చూసి వెళ్ళిపోయాడతడు. అరుణ్ అతడి వెంట కారు వరకు వెళ్ళాడు. పొడవుగా, స్లిమ్ గా ఉండే డాక్టర్ విన్సెంట్ ప్రతిమాట, కదలిక అతడిపట్ల ఎదుటి వ్యక్తులకు ఒక గౌరవ భావాన్ని కలగచేస్తాయి.

'నా మనసుకు తగిలిన గాయాలకు నిన్ను నిందించాను. నువ్వు మౌనంగా భరించావు. లతను తెచ్చి మళ్ళీ నాకు కలిపి, ఏదో ఓలా బ్రతికేస్తున్న నా జీవితంలో అలజడిని సృష్టించావ్. ఎందుకు నన్నిలా బాధిస్తున్నావ్? లతను నాకు పూర్తిగా ఇచ్చేయ్ .. ప్లీజ్' మనసులోనే దేవుడ్ని ప్రార్థించాడు హేమంత్.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS